క్లుప్తంగా

ట్యాంకర్లతో నీటి సరఫరా



తిరుమలగిరి 4వ వార్డులో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్‌ సిబ్బంది

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 3, 4 వార్డుల్లో గత వారం రోజులుగా మిషన్‌ భగీరథ నీళ్ల నల్లాల ద్వారా సరిగా అందడం లేదు. దీంతో నీటి కొరత తీవ్రమైంది. కాలనీవాసులు నీటి కొరతపై మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయగా శనివారం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.

నేడు అడివెంలకు మంత్రి కోమటిరెడ్డి రాక

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామ ఎస్సీకాలనీలో జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుంగతుర్తి, మునుగోడు ఎమ్మెల్యేలు మందుల సామేలు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్‌ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం హాజరవుతున్నారని రేఖ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ డాక్టర్‌ బోయాలపల్లి రేఖ తెలిపారు. రేఖ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

అర్వపల్లి : మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం వైద్యసిబ్బంది మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్‌ బి.అర్జున్‌, సిబ్బంది యాకయ్య, రైతులు దాసరి నర్సయ్య, బొల్లం గోపాల్‌, పులిచర్ల శ్రీరాములు, బండారి నారాయణ, నర్సింగ వెంకన్న, బొబ్బిలి చినమల్లయ్య పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్‌ నాయకుడు మృతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్‌ (ఎస్‌) : మండల పరిధిలోని గట్టికల్‌ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్‌ నాయకుడు రాచకొండ సత్తయ్య (85) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మృతదేహంపై పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దండా వెంకటరెడ్డి, మండల కార్యదర్శి ఆవిరే అప్పయ్య పార్టీ కండువా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు సోమిరెడ్డి దామోదర్‌ రెడ్డి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, గుండు అబ్బయ్య, గుండు రమేష్‌, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

నూతనకల్‌ : మండల పరిధిలోని దిర్శనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న దుర్గామాత సేవా మందిరం నిర్మాణానికి ఎమ్మెల్యే మందుల సామేల్‌ రూ. 25వేల విరాళం ప్రకటించారు. ఆ నగదును తుంగతుర్తి మార్కెట్‌కమిటీ చైర్మన్‌ తీగల గిరిధర్‌రెడ్డి శనివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు రాచకొండ అయోధ్య, పాండవుల లింగయ్య, అశోక్‌, వాసు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్‌ (ఎస్‌) : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల పరిధిలోని నెమ్మికల్‌ గ్రామానికి చెందిన పూదారి సైదులు కుటుంబానికి 1992–93 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌ విద్యార్థులు శనివారం రూ. 36,500ల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భయ్య మల్లయ్య, గజవెల్లి ఉప్పలచారి, జటంగి రామ నరసయ్య, రేపాక పద్మ, బిజిగ కలమ్మ, హనుమంతు, జానకి రాములు, పరమాత్మ, సత్యనారాయణ, బెల్లంకొండ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలి

నడిగూడెం : సాగర్‌ నీటితో చెరువులను నింపాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నడిగూడెం మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా చెరువులు పూర్తిగా ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. దీంతో గ్రామల్లోని ప్రజలతో పాటు మూగజీవాలకు కూడా తాగు నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు.

నిర్వహణ లేక.. నెరవేరని లక్ష్యం

- గ్రామాల్లోని సంపద వనాల్లో ఎండుతున్న మొక్కలు
- నీరు పోయడం, కలుపు మొక్కలు తొలగించడంలో సిబ్బంది నిర్లక్ష్యం



పడమటితండా సమీపంలోని సంపద వనం

అర్వపల్లి : ప్రభుత్వ భూములను ఎంపిక చేసి పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను పెంచాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వనాల్లో పర్యవేక్షణ లేక మొక్కలు ఎండిపోతున్నాయి. పండ్లు, నీడనిచ్చే మొక్కలకు బదులు పిచ్చిమొక్కలు, ఎండుగడ్డి దర్శనమిస్తున్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా గతేడాది సెప్టెంబర్‌లో సంపద వనాలను ఏర్పాటు చేశారు. ఈ వనాల్లో పండ్లు, నీడనిచ్చే మొక్కలతో పాటు కానుగ, వేప తదితర రకాల మొక్కలు నాటారు. అడివెంలలో 2, అర్వపల్లిలో 4, రామన్నగూడెంలో 2, కాసర్లపహాడ్‌లో 1 చొప్పున సంసద వనాలను ఏర్పాటు చేశారు. ఈ వనాలలో 4,787 మొక్కలను నాటారు. ఒక్కో సంపద వనంలో 400 నుంచి 600 వరకు మొక్కలు నాటి పెంచుతున్నారు. ఈ సంపద వనాల నిర్వహణ బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. అయితే ప్రతిరోజు ఈ మొక్కలకు నీళ్ల పోయాల్సి ఉంది. అలాగే వనాలలో కలుపు మొక్కలను ఏరివేయటం తదితర నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు చూడాలి. కానీ నీళ్ల సరిగా పోయకపోవడం, నిర్వహణ సరిగా లేకపోవడంతో సంపద వనాలలో సగానికి పైగానే మొక్కలు ఎండిపోయాయి. కొన్ని వనాలు పిచ్చిచెట్లు, గడ్డితో నిండాయి. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరని పరిస్థితి ఏర్పడింది. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సంపద వనాలు కనుమరుగైపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంపద వనాల నిర్వహణ సక్రమంగా చేపట్టి ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

నిర్వహణ సరిగాలేదు



సంపద వనాలను మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసినప్పటికీ నీళ్లు సరిగా పోయకపోవటం, నిర్వహణ కొరవడటంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలి. ప్రతిరోజూ మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి.

– అంగోతు అనిల్‌, పడమటితండా

ఏర్పాటు చేసి వదిలేశారు



ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి సంపద వనాలను ఏర్పాటు చేసింది. కానీ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు వాటి నిర్వహణ లేకుండా పోయింది. రోజుల తరబడి నీళ్లు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. సంపద వనాలు అన్నీ దాదాపు ఖాళీగానే కన్పిస్తున్నాయి.

– వజ్జె వినయ్‌, జీఎంపీఎస్‌ నాయకుడు, రామన్నగూడెం

తనిఖీలతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు



ఏపూరు గ్రామానికి చెందిన వ్యక్తుల నుంచి డబ్బులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఆత్మకూరు (ఎస్‌) : ఎన్నికల నిబంధనలు సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికలకు నోటిఫికేషన్‌ రావడంతో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ.50 వేలకు నుంచి నగదును తరలించకూడదు. దీంతో పోలీస్‌ యంత్రాంగం ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేపడుతుంది. ఫలితంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు రూ.50వేల వరకు తీసుకువెళ్తున్నా అధికారులు సీజ్‌ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తమ వద్ద డబ్బులు సీజ్‌ చేయడం కాదని పెద్ద మొత్తంలో డబ్బులు తరలించే రాజకీయవేత్తల నుంచి డబ్బులు సీజ్‌ చేయాలని సామాన్య ప్రజలు వేడుకుంటున్నారు. తాము ఏ పార్టీకి, ఏ రాజకీయ నాయకుడికి ఈ డబ్బులు ఇవ్వడం లేదని.. తమ వ్యాపారాలు, ఇంటి అవసరాల కోసం అని చెప్పినా పోలీసులు వినిపించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇటీవల నెమ్మికల్‌ సంత నిర్వహణ సమయంలో కొందరు యాదవులు బేరాలకు వచ్చి డబ్బులు తీసుకువెళ్తున్న క్రమంలో రసీదులు ఉన్నప్పటికీ రూ.50 వేల కంటే 500 ఎక్కువ ఉన్నందున తమ డబ్బులు సీజ్‌ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏపూరు గ్రామానికి చెందిన తండ్రి కొడుకుల వద్ద రూ.51,500 ఉండగా ఆ డబ్బులు కూడా సీజ్‌ చేశారని బాధితులు తెలిపారు. తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిబంధన పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు తప్ప ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులను పట్టించుకోవడంలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ నిబంధన నుంచి సామాన్య జనాన్ని తప్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నిబంధనల మేరకే డబ్బులను సీజ్‌ చేస్తున్నామని, తాము ఎవరినీ ఇబ్బందులకు గురిచేయడం లేదని మండల పోలీసులు తెలుపుతున్నారు.

దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలు



కాంగ్రెస్‌ పార్టీలోకి ఆహ్వానిస్తున్న పటేల్‌ రమేష్‌రెడ్డి

భానుపురి : రానున్న పార్లమెంటు ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చనున్నాయని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్‌ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నివాసంలో 35వ వార్డు కౌన్సిలర్‌ జ్యోతి కరుణాకర్‌ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని అతి తక్కువ సమయంలో అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే అన్నారు. 35వ వార్డు చర్చి కాంపౌండ్‌ ప్రాంతాన్ని దత్తత తీసుకొని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో షఫీఉల్లా, చిలుముల గోపాల్‌రెడ్డి, నేరేళ్ల వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్‌, రమేష్‌నాయుడు, సంజయ్‌, సైదులు, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిని మోడల్‌ మున్సిపాలిటీ చేస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్‌, పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడల్‌ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్‌ అన్నారు. శనివారం మున్సిపల్‌ కార్యాలయంలో నూతన చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్‌పర్సన్‌గా శాగంటి అనసూయ, కేశిడి సరళలు ఎన్నికైన అనంతరం స్థానిక చౌరస్తాలో అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని, గతంలో జరిగిన అప్రజాస్వామిక పాలనకు చరమగీతం పాడామని అన్నారు. గతంలో లాగా మున్సిపాలిటీ పరిధిలో దౌర్జన్యాలు, భూ దందాలు, అక్రమాలు పని చేయవన్నారు. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని.. జిల్లాలోనే నంబర్‌ 1 మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు పాలకుర్తి రాజయ్య, పట్టణ శాఖ అధ్యక్షులు పేరాల వీరేష్‌, ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు కందుకూరి అంబేద్కర్‌, సుంకరి జనార్దన్‌, జెమ్మిలాల్‌, ఎండీ.హఫీజ్‌, కందుకూరి లక్ష్మయ్య, శాగంటి రాములు, రాపాక సోమేష్‌ పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

తిరుమలగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తానని నూతనంగా ఎన్నికైన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ శాగంటి అనసూయ రాములు తెలిపారు. శనివారం నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్‌, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్‌, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్‌, కందుకూరి లక్ష్మయ్య, మోహన్‌ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న మెడిప్లస్‌ హెచ్‌ఆర్‌ తాజోద్దీన్‌

చివ్వెంల : భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం ఉంటుందని మెడిప్లస్‌ హెచ్‌ఆర్‌ తాజోద్దీన్‌ అన్నారు. శనివారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ఠ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఫామ్‌ 'డీ' చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్‌ ప్లేస్‌మెంట్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కళాశాలకు న్యాక్‌ ×ఏ౹ గ్రేడ్‌ రావడం అభినందనీయమన్నారు. చదువుకునే రోజుల్లోనే విద్యార్థులు భవిష్యత్‌కు ఉపయోగపడే విద్యను ఎంచుకోవడంతో ఉద్యోగాలను సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి 25 మంది విద్యార్థులు ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్‌ తరానికి ఉపయోగపడే సైన్స్‌పై పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ శివరామకృష్ణ, ప్రిన్సిపల్‌ రాజ్‌ కుమార్‌, సెక్రటరీ విజయలక్ష్మి, వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ మధు, కుమార్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ దేవత ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ, బోనాల ఊరేగింపు నిర్వహించారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ ఉత్సవాలకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ బీరవోలు సోమిరెడ్డి, బీరవోలు విక్రమ్‌రెడ్డి, రేఖ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఫౌండర్‌ డాక్టర్‌ బోయాలపల్లి రేఖ, మాజీ సర్పంచ్‌లు మద్ది పద్మ, పెరుమాళ్ల పద్మ, ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పేరెల్లి ఉపేందర్‌, శతకోటి విద్యాసాగర్‌, బోయిళ్ల తిరుమల్‌, వెంకటాద్రి, లింగయ్య, నాగరాజు, బొర్ర శైలేందర్‌, కలకోట్ల శైలేందర్‌, టి.ప్రవీన్‌, సైదులు, వెంకన్న, ఎద్ల సైదులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం అన్యాయం

కోదాడ : పార్లమెంట్‌ నియోజకవర్గాల్లో మాదిగ ఓటర్లు ఎక్కువగా ఉన్నప్పటికీ కాంగ్రెస్‌ పార్టీ మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం అన్యాయమని మహజన సోషలిస్ట్‌ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు అన్నారు. ఈమేరకు శనివారం కోదాడలో అంబేద్కర్‌ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్‌, మహాజన సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ ఇప్పటికైనా మాదిగలకు కనీసం రెండు పార్లమెంట్‌ సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డేపల్లి కోటేష్‌, యలమర్తి రాము, ఏపూరి సత్యరాజు, కుక్కల కృష్ణ, సూరిబాబు, సూర్యప్రకాశ్‌, రామారావు, వెంకన్న పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలి



తిరుమలగిరి : టిఫిన్‌ బైటక్‌ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



తుంగతుర్తిలో జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు



నాగారంలో టిఫిన్‌ బైటక్‌ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తిరుమలగిరి : రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ పిలుపు మేరకు శనివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ బూత్‌లతోపాటు మండలంలోని గ్రామాల్లో టిఫిన్‌ బైటక్‌ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకూ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధీన్‌దయాళ్‌, వేల్పుల బంగారు స్వామి, మేకల శ్రీనివాస్‌రెడ్డి, ఈదునూరి సుభాష్‌రెడ్డి, కొండా సోమయ్య, తీపిరెడ్డి సోమిరెడ్డి, హరీష్‌, మర్రి వెంకటేశ్వర్లు, బూర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

తుంగతుర్తి : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలో నరేంద్రమోదీ నాయకత్వంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక సాయిబాబా, నియోజకవర్గ కన్వీనర్‌ కాప రవి, నాయకులు గాజుల మహేందర్‌, ఉప్పుల లింగయ్య, రఫిక్‌, అంబటి రమేష్‌, యాదగిరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

నాగారం : రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో భువనగిరి బీజేపీ అభ్యర్థి డాక్టర్‌ బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ పిలుపుమేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన టిఫిన్‌–బైటక్‌ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీని మూడోసారి గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్‌, మహేష్‌, భార్గవ్‌, శివ, యాకూబ్‌, రమేష్‌, గణేష్‌, లింగమ్మ, వెంకటమ్మ, మల్లమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

నూతనకల్‌ : రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌ కాప రవికుమార్‌ కోరారు. శనివారం పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన టిఫిన్‌ బైటక్‌ కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, బండపల్లి బుచ్చిరాములు, అనంతరెడ్డి, కుమారస్వామి, సోమలింగం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కూరం మణి

నాగారం : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ బ్రహ్మయ్య, ఎంపీడీఓ జి.శోభారాణి, ఎస్సారెస్పీ డీఈఈ పిచ్చయ్య, ఎంఈఓ బి.బాలునాయక్‌, విద్యుత్‌ ఏఈఈ మహేంద్రకుమార్‌, ఏఓ గణేష్‌, డాక్టర్‌ హర్షవర్ధన్‌, ఎంపీఓ ధార శ్రీనివాస్‌, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌పోజర్‌ విజిట్‌కు 'మోడల్‌' విద్యార్థులు



హైదరాబాద్‌లోని జూపార్కులో అనంతారం మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్‌ స్కూల్‌ పీఎంశ్రీ స్కూల్‌ స్కీంకు ఎంపికైంది. దీంతో ఆ మోడల్‌ స్కూల్‌ విద్యార్థులను శనివారం ఎక్స్‌పోజర్‌ విజిట్‌ కోసం హైదరాబాద్‌లోని సాలార్జంగ్‌ మ్యూజియం, నెహ్రూ జువాజికల్‌ పార్కుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ వేముల బాలరాజు మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందుతుందని, మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అర్వపల్లి : అడివెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం మల్లేష్‌



అర్వపల్లి : రామన్నగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అర్వపల్లి : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం వలిశెట్టి మల్లేష్‌ కోరారు. మండల పరిధిలోని అడివెంల, రామన్నగూడెం గ్రామాలలో శనివారం సెర్ప్‌ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా గ్రామగ్రామాన సెర్ప్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులు ఈ కేంద్రాలలో ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ సీఈఓ మేడబోయిన రామస్వామి, సీసీలు నగేష్‌, పద్మావతి, నిర్వాహకులు ఈగ మాధవి, తవిటి మమత, ఆవుల భవాని, మచ్చ పూలమ్మ, మంగమ్మ, వీఓఏ రమావత్‌ సరిత, మాజీ సర్పంచ్‌ కె.వెంకన్న, ఆవుల విక్రమ్‌, మారిపెద్ది యాదగిరి, బండారి నాగరాజు, మచ్చ లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

అర్వపల్లి : ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లే కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ చిలుక ఉపేందర్‌ కోరారు. అడివెంల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వడదెబ్బపై కూలీ లకు అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ చెరుకు గంగ, ఆశ కార్యకర్త ఎద్ల పుష్ప, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.



ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఏపీఓ

మండే ఎండలు.. ప్రయాణికుల పాట్లు



అర్వపల్లిలో ఎర్రటి ఎండలో బస్సు కోసం క్యూలైన్లలో ఉన్న విద్యార్థులు



బస్టాండ్‌ లేక రోడ్డుపైనే ప్రయాణికులు

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్‌–తానంచర్ల రెండు జాతీయ రహదారులు కలిసే కూడలి అయిన అర్వపల్లిలో బస్టాండ్‌ లేక ప్రయాణికులు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఈ ఎండల్లోనే ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. వందల కోట్ల రూపాయలు వెచ్చించి హైవే రోడ్ల నిర్మాణం చేపట్టినా బస్టాండ్‌ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అర్వపల్లి జంక్షన్‌లో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని పలువురు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.